సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 12 । మే । 2023



కల్తీపాలు స్వాధీనం

భూదాన్‌పోచంపల్లి మండలం జిమనపల్లిలో కల్తీ పాలను ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 10లో



జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. - 11లో

గరిష్టం/కనిష్టం 40°/25°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గురుకుల టీచర్ పరీక్ష అభ్యర్థులకు ఉచిత శిక్షణ

చౌటుప్పల్ : గురుకుల టీచర్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ బీసీ ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఉమ్మడి జిల్లా సంచాలకులు కొప్పు విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డిగ్రీ, బీఈడీ మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు 75శాతం హాజరు ఉంటే స్కాలర్‌షిప్, ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. గతంలో శిక్షణ పొందిన అభ్యర్థులు అనుమతి లేదన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, మరిన్ని వివరాలకు 08682 – 220007 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వాసాలమర్రిలో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కపల్లి : సీఎం దత్తత గ్రామం అయిన తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో చేపట్టిన ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం పనులను మండల ప్రత్యేకాధికారి జినుకుల శ్యామ్‌సుందర్ బుధవారం పరిశీలించారు. నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈ తులసి క్రిష్ణ పాల్గొన్నారు.

13న ఓపెన్ ఇంటర్ పరీక్ష

భువనగిరి : ఈ నెల 2వ తేదీన జరగవల్సిన ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష ఈ నెల 13న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలచే పరీక్ష వాయిదా పడిందని.. తిరిగి అదే కేంద్రాలలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు పాత హాల్ టిక్కెట్లతోనే పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి : అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్ కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, కిరణ్, వేముల సుమన్ తదితరులు ఉన్నారు.

ఇంటి నంబర్ తప్పుగా నమోదైతే సవరణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ ప్రకాశ్

హుజూర్‌నగర్: ఓటరు జాబితాలో ఇంటి నంబర్లు తప్పుగా నమోదైతే ఫామ్ 8 ద్వారా సవరణ చేస్తారని డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (డీఏఓ) ప్రకాష్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ప్రస్తుతం ఒకే ఇంటి నంబర్‌పై ఆరుగురి కంటే ఎక్కువ మంది ఉన్న ఓటర్ల జాబితా ఇచ్చారని దానిని బీఎల్‌ఓలకు ఇచ్చినట్లు చెప్పారు. బీఎల్‌ఓలు సదరు జాబితాను సరిచూసి నివేదిక అందజేస్తారని చెప్పారు. ప్రతీ వారం సమావేశం నిర్వహించి ఎన్నికల కమిషన్ అందించే సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలియజేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారం తెగిన బతుకులు!

ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాలకు అందని ఎక్స్‌గ్రేషియా

- జిల్లాలో 13 మంది బలవన్మరణం
- ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎనిమిదేళ్లుగా చేతికందని పరిహారం
- బాధిత కుటుంబాల్లో పుట్టెడు నిర్వేదం

సాక్షి యాదాద్రి : చేతినిండా పనిలేక, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక.. ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. ఇంటి యజమాని మరణంతో కుటుంబాలను పోషించుకోలేక, పిల్లలను చదివించే ఆర్థిక స్థోమత లేక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు విచారణ చేసి ఆశలు కల్పించినా ఆర్థిక సహాయం మాత్రం అందడం లేదు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఎక్స్‌గ్రేషియా, అప్పులు సెటిల్‌మెంట్ చేయడానికి ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, నిధులు మాత్రం విడుదల కాలేదు. చొరవ చూపి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించాల్సిన ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కలెక్టర్ నిధుల నుంచైనా ఆర్థిక సాయం అందజేయాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

త్రిమెన్ కమిటీ నివేదిక బుట్ట దాఖలు

చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్న వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిమెన్ కమిటీ నిజ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. రెవెన్యూ డివిజనల్ అధికారి, ఏసీపీ, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో కూడిన త్రిమెన్ కమిటీ.. జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల మృతిని నిర్ధారించింది. ఇందుకోసం డెత్ సర్టిఫికెట్, పోస్ట్‌మార్టమ్ రిపోర్టు, ఎఫ్ఐఆర్, ఆత్మహత్యకు పాల్పడిన కార్మికుడి కుటుంబ సభ్యులను విచారించిన అనంతరరం ఎక్స్‌గ్రేషియా కోసం చేనేత, జౌళి శాఖకు నివేదిక సమర్పించారు. అయినప్పటికీ బాధిత కుటుంబాలకు పరిహారం అందడం లేదు.



భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కార్మికురాలు గుండు నిర్మలది నిరుపేద కుటుంబం. నమ్ముకున్న వృత్తి కడుపు నింపలేదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దాంతో తీవ్ర మనస్తాపం చెందిన భర్త గుండు లక్ష్మీనారాయణ 2021 ఏప్రిల్ 24వ తేదీన ఇంట్లో ఉరివేసుకొని బలవర్మరణానికి పాల్పడ్డాడు. వీరికి మహేశ్, సంపత్ ఇద్దరు కుమారులు. చిన్నవయస్సులో భర్త ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం, మరోవైపు ఇద్దరు చిన్నారుల భవిష్యత్ కళ్లముందే కదలాడుతుంటే ఏమి చేయాలో తోచలేదు. గతంలో భర్తతో పాటు కూలీకి చిటికీలు కట్టేది. కానీ చిటికి కట్టే పని రోజూ ఉండదు. దాంతో ఇటీవల మగ్గం నేయడం నేర్చుకుంది. రోజూ కూలికి మగ్గం నేస్తూ వచ్చే ఆదాయంతో పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. సొంతిల్లు లేక అద్దెకు ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా లభిస్తుందని రెండేళ్లుగా ఎదురు చూస్తుంది.

13 మంది బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందుల కారణంగా జిల్లాలో 2015 నుంచి 2021 నవంబర్ వరకు 13 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ఎక్స్‌గ్రేషియా అందలేదు. వీరంతా ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నారు.

పైరవీలకే పెద్ద పీట

జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయంలో పైరవీలకే పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడం, వాటిపై ప్రచారం చేయడం, అమలు ఏజెంట్ల ద్వారా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మృతిచెందిన చేనేత కార్మికుల కుటుంబ సభ్యులు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా స్పందించేనాధుడే లేదు.

ప్రభుత్వానికి లేఖ రాసినా ఫలితం లేదు



ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. అంతేకాకుండా ఎన్నోసార్లు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. ఎక్స్‌గ్రేషియా కోసం బాధిత కుటుంబాలు తిరగని కార్యాలయం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చూడాలి. అందులో రూ.50 వేలు అప్పులు తీర్చి మిగతా డబ్బులతో జీవనోపాధి కల్పించుకుంటారు.

–చింతకింది రమేష్, చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు

కలెక్టరేట్‌ను సందర్శించిన ఒడిశా అధికారులు



ట్రైనీ అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్ : ఒడిశా రాష్ట్ర పాలనా విభాగానికి చెందిన 33 మంది ట్రైనీ అధికారుల బృందం గురువారం కలెక్టరేట్‌ను సందర్శించారు. కలెక్టర్ పమేలా సత్పతితో సమావేశమై పాలనాపరమైన అంశాలపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం భువనగిరి కోటను సందర్శించి కట్టడాలను పరిశీలించారు. కోట ప్రాశస్త్యం గురించి తెలుసుకున్నారు. అంతకుముందు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

ఆయిల్‌పామ్‌తో రైతుల ఆర్థికాభివృద్ధి

మోత్కూరు : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మోత్కూరు మండలంలోని పనకబండలో రైతు ఓర్సు నర్సింహ ఆయిల్‌పామ్ సాగు చేయనున్న భూమిని గురువారం పరిశీలించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటడానికి జూన్ నుంచి అనువైన సమయం అన్నారు. మొక్కలు నాటిన తర్వాత అంతర పంటగా పత్తి, కంది ఇతరత్రా పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. రైతులు డ్రిప్, మొక్కలకు డీడీలు కట్టి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని తిరుమలేష్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పి.రమేష్, మాజీ సర్పంచ్ బత్తిని హన్మంతు, ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.



క్షేత్ర సందర్శన చేస్తున్న రామకృష్ణారెడ్డి

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరిటౌన్ : ఉపాధి కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏఈలు, వెటర్నరీ డాక్టర్లతో సమావేశమైన వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వ నిర్దేశిత రేటు ప్రకారం కనీస వేతనం పడే విధంగా పనులు కల్పించాలని, సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు. వైకుంఠధామాల్లో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అర్హత కలిగిన ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఓడీఎఫ్ కోసం అన్ని గ్రామాల్లో మూడు రకాల వాల్ పేయింటింగ్ వేయించాలని సూచించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక గ్రామాలను ఓడీఎఫ్‌గా డిక్లేర్ చేశారని, అందులో జిల్లాకు కూడా ప్రాతినిధ్యం ఉందన్నారు. అందుకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, పాల్గొన్న అధికారులు

అదే విధంగా నీటిపారుదల శాఖను సమన్వయం చేసుకొని మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. ఈనెల అన్ని మండలాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీపీఓ సునంద, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ, పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి యాదగిరి, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కన్సల్టెంట్‌లు పాల్గొన్నారు.

వివాహ వేడుకలోనూ జేపీఎస్‌ల నిరసన

- వధువుతో పాటు సహచర కార్యదర్శులతో కలిసి ప్లకార్డు ప్రదర్శించిన శ్రీకాంత్



పెళ్లి మండపంలో ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తున్న వరుడు, జూనియర్ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, సహచర కార్యదర్శులు

చౌటుప్పల్ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఓ జూనియర్ పంచాయతీ కార్యదర్శి తన వివాహ వేడుకలోనూ నిరసన కొనసాగించాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన చింతల శ్రీకాంత్.. ఇదే మండలంలోని పంతంగి గ్రామ కార్యదర్శిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు గురువారం కట్టంగూరు మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వివాహానికి చౌటుప్పల్ మండలంలోని రెగ్యులర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు పరిసర మండలాల్లో పనిచేసే సహచర జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. మూడుముళ్ల తంతు పూర్తికాగానే బంధుమిత్రులు, అతిథులు నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు వేదికపైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వరుడు శ్రీకాంత్ తన భార్యతో కలిసి ప్లకార్డుతో వినూత్నంగా నిరసనకు దిగాడు. జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్లకార్డును ప్రదర్శించారు. అక్కడే ఉన్న మిగతా పంచాయతీ కార్యదర్శులు కూడా వేదికపైకి వెళ్లి నిరసనలో పాల్గొన్నారు. ఇప్పటికైనా పెద్ద మనసు చేసుకొని కార్యదర్శుల సమస్యను పరిష్కరించాలని పెళ్లికి వచ్చిన అతిథులు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వేడుకున్నారు.

శ్రీలక్ష్మీనృసింహులకు నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన పూజలు గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

15 స్కూళ్లలో వంద శాతం

- టెన్త్‌లో సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు
- ప్రైవేట్‌కు దీటుగా 17మందికి 10 జీపీఏ
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉత్తీర్ణత
- ఫలితాలపై త్వరలో సమీక్ష

భువనగిరి : విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. 15 పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు 10కి 10 జీపీఏ మార్కులు సాధించారు. అయితే మొత్తంగా చూస్తే గత ఏడాది కంటే ఈసారి ఉత్తీర్ణత తగ్గడం ఒకింత నిరాశకు గురి చేసింది.

సర్కారు పాఠశాలల్లో ఇలా..

జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు 712 ఉన్నాయి. ఇందులో పదవ తరగతికి సంబంధించి ఉన్నత పాఠశాలలు 6, జెడ్పీహెచ్ఎస్ 149, టీఎస్ఎంఎస్ 7, టీఎస్ఆర్ఈఎస్ 3, ఆర్ఈఎస్ మైనార్టీ 3, ఆర్ఈఎస్ బీసీ 3, ఆర్ఈఎస్ ఎస్‌డబ్ల్యూ 8, మోడల్ 1, కేజీబీవీలు 11, ఎయిడెడ్ 1 చొప్పున ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి 6,426 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4,847 మంది ఉత్తీర్ణులయ్యారు. వీటిలో 15 పాఠశాలల్లో వందకు వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా.. 28 పాఠశాలల్లో 50 శాతం లోపు పాసయ్యారు. మిగతా పాఠశాలల్లో 70, 80, 90 శాతంగా ఉత్తీర్ణత నమోదైంది. ఎయిడెడ్ పాఠశాలలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉండగా అతడు ఫెయిల్ అయ్యాడు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తాం

పదవ తరగతి పరీక్ష ఫలితాలను పాఠశాలల యాజమన్యాల వారీగా పరిశీలించాం. ఫలితాలపై ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తాం. తక్కువ ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల విషయంలో ఏ విధంగా వ్యవహరించాలనే విషయమై సమీక్షలో చర్చించే అవకాశం ఉంటుంది.

–ప్రశాంత్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఏడీ

కాగా 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ సంజాయి అడిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వంద శాతం కోసం ప్రత్యేక తరగతులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్‌లోనే సిలబస్ పూర్తి చేసి అదే నెల నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు, సాయంత్రం 4.45నుంచి 5.45 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కానీ, ఆశించిన ఫలితం కనిపించలేదు. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలకు వచ్చేవారు.ఫిబ్రవరి వరకు అల్పాహారం అందించకపోవడంతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేకపోయారు. అంతేకాకుండా ప్రత్యేక తరగతులు నడుస్తున్న సమయంలోనే ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడంతో ఉపాధ్యాయులు అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. ఎక్కువగా గణితం, సైన్స్‌లో ఉత్తీర్ణత తగ్గిందని, ఇందుకు ఒకే రోజు సైన్స్ రెండు పేపర్లు పరీక్ష నిర్వహించడం, విద్యార్థులకు గణితం పట్ల సరైన అవగాహన కల్పించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

శిక్షణలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు

యాదగిరిగుట్ట రూరల్, ఆత్మకూరు(ఎం) : గ్రామ పంచాయతీల్లో పాలన, అభివృద్ధి పనులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఈటీసీ కార్యాలయంలో సర్పంచ్‌లకు గురువారం శిక్షణ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు. వారిలో ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జన్నాయికోడె నగేష్, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేపాక స్వామి, పెద్దకందుకూరు ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, జంపాల సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.




శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు

తవ్వేస్తూ.. వదిలేస్తూ!

- భువనగిరిలో పైపులైన్లు, ఇంటర్‌నెట్ కేబుళ్ల కోసం రోడ్ల తవ్వకాలు
- తిరిగి పూడ్చకుండా వదిలేస్తున్న కాంట్రాక్టర్లు
- వాహనదారుల ఇబ్బందులు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల వేసిన బీటీ, సీసీ రోడ్లు స్వల్పకాలానికే ధ్వంసం అవుతున్నాయి. వివిధ రకాల పైపులైన్లు, ఇంటర్‌నెట్ కేబుల్స్ వేయడానికి రోడ్లను అడ్డగోలుగా తవ్వుతున్నారు. పనులు పూర్తయిన వెంటనే తిరిగి మరమ్మతులు చేయాల్సి ఉండగా అదే విధంగా వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా.. రోడ్డు తవ్వకాలు చేపట్టాలంటే ఎవ్వరైనా సరే ముందస్తుగా మున్సిపల్ కమిషనర్, గ్రామ పంచాయతీ పరిధి అయితే సంబంధిత అధికారి అనుమతి తీసుకోవాలి. చేసే పని, ఎన్ని కిలో మీటర్లు తవ్వకాలు జరుపుతారనే అంశాలతో కూడిన దరఖాస్తును సంబంధిత అధికారి పేరుతో ఫొటో జత చేసి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రం జారీ చేసే సమయంలో తిరిగి రోడ్లు పూడ్చాలని పేర్కొంటారు. కానీ, అవేమీ పాటించడం లేదు. ఫలితంగా రోడ్లు వేసిన స్వల్పకాలానికే పాడువుతున్నాయి.



కలెక్టరేట్ వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు

మళ్లీ భానుడు భగభగ

- 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఎండ, ఉక్కపోతతో జనం విలవిల

చౌటుప్పల్ : మొన్నటి వరకు కాస్త శాంతించిన భానుడు మళ్లీ ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రెండు రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండడంతో అత్యవసరం అయితే తప్ప.. జనం ఇళ్లనుంచి బయటకు రావడం లేదు. గురువారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 5 దాటినా అదే తీవ్రత కొనసాగింది. చౌటుప్పల్ పట్టణంతో పాటు మండల పరిధిలో ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రతగా చెప్పవచ్చు.

బోసిబోయిన రహదారులు

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారింది. సర్వీస్ రోడ్లతో పాటు చిన్నకొండూర్, వలిగొండ, తంగడపల్లి రోడ్లుతో పాటు ప్రధాన అంతర్గత రహదారులు సైతం జనం లేక బోసిపోయాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు తలపాగా చుట్టుకోవడం, స్కార్ఫ్‌లు, టోపీలు ధరించడం వంటి రక్షణ చర్యలు తీసుకున్నారు. ఎండకు తోడు విపరీతమైన ఉక్కపోత ఉండడంతో జనం అల్లాడిపోయారు.



చౌటుప్పల్‌లో నిర్మానుష్యంగా జాతీయ రహదారి

క్లుప్తంగా

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

మాడుగులపల్లి: మండల కేంద్రం శివారులో గురువారం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. చెరువుపల్లి గ్రామానికి చెందిన జూపూడి ఆంజనేయులు స్థానిక కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను లోడ్ చేసుకొని మిర్యాలగూడలోని రైస్‌మిల్లులో దిగుమతి చేసేందుకు బయలుదేరాడు. మాడుగులపల్లి శివారుకు రాగానే ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపి మూత్రవిసర్జనకు వెళ్లాడు. గేరు న్యూట్రల్‌లో ఉండడంతో ట్రాక్టర్ రోడ్డు దిగువకు వెళ్లి బోల్తాపడింది. దీంతో బస్తాలు కింద పడి ధాన్యం నేలపాలైంది. కాగా.. లారీల కొరత కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నామని, అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు, నల్లాలు ధ్వంసం



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఫ్యాన్లు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు– మన బడి పథకంలో భాగంగా 3వ తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు, లైట్లు, నల్లాలు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం కాంతయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ సైదులు మాట్లాడుతూ రాత్రి సమయంలో కొంతమంది ఆకతాయిలు పాఠశాలలోనికి ప్రవేశించి వీటిని ధ్వంసం చేశారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.



ధ్వంసమైన నల్లాలు

నర్సులు.. నిస్వార్థ సేవకులు

- ఆస్పత్రుల్లోని రోగులకు నిరంతరం వైద్యసేవలు
- మానవతామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో ఈ వృత్తిలోకి..

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నల్లగొండ టౌన్: ఆస్పత్రుల్లోని రోగులకు నిరంతరం వైద్య సేవలందించడమే నర్సుల లక్ష్యం. ఆప్యాయంగా పలకరిస్తూ రోగులకు సమయానికి మందులు వేసి వారు కోలుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. నర్సు వృత్తికి మానవసేవే మాధవసేవ అనే పరమార్థం కూడా ఉంది. వృత్తికి రూపకల్పన చేసిన మానవతామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్. ఈమె 1820 మే 12న ఇంగ్లాండ్‌లో జన్మించారు. తండ్రి కోరికకు విరుద్ధంగా నర్సింగ్ వృత్తిని ఎంచుకుని మిలటరీ వైద్యశాలలో నర్సుగా పనిచేశారు. క్రిమియన్ యుద్ధంలో క్షతగాత్రులైన సైనికులకు సేవలందించి వారి ప్రాణాలను కాపాడారు. రాత్రి వేళల్లో లాంతరు పట్టుకుని వెళ్లి క్షతగాత్రులకు సేవచేశారు. అందుకే ఈమె 'ఏ లేడీ విత్ ల్యాంప్'గా పేరు పొందారు. ఆమె జన్మదినం సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నాం.

నల్లగొండ జిల్లాలో 1000 మందికిపైగా నర్సులు..

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను కలుపుకుని సుమారు వెయ్యి మందికి పైగా నర్సులు నల్లగొండ జిల్లాలో సేవలు అందిస్తున్నారు. అయితే ఎంతోమంది ప్రాణాలు కాపాడి వారి జీవితాల్లో ఆనందాలు నింపిన నర్సుల కళ్లలో మాత్రం వెలుగులు నిండడం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఆదరణ కరువైందని, పనిచేసే దగ్గర కనీస వసతులుకాని, సరైన వేతనం, గౌరవం లేకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. దీంతోపాటు పై అధికారుల వేధింపులు, రోగుల బంధువుల నుంచి ఈసడింపులకు గురవుతున్నామని వాపోతున్నారు. తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన తీసుకున్న తమ సర్వీసును క్రమబద్ధీకరించకుండా తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల స్థాయికి తగ్గట్టుగా నర్సులను నియమించకుండా ఉన్న అరకొర సిబ్బందితోనే పనిచేయిస్తూ తమపై పనిభారాన్ని మోపుతున్నారని పేర్కొంటున్నారు. ఇన్ సర్వీస్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుకోవడానికి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, నర్సింగ్ సిబ్బందికి రెస్ట్, డ్రెస్సింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సులు

సేవచేసే భాగ్యం నర్సులకే దక్కుతుంది



రోగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే. ఆ అవకాశం కేవలం నర్సులకే దక్కుతుంది. రోగులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం దేంట్లోనూ ఉండదు. నర్సింగ్ వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతున్నా.

– ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్– 2

అదృష్టంగా భావిస్తున్నా..



నర్సింగ్ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ వృత్తిలో లభించే సంతృప్తి మరే వృత్తిలో దొరకదు. నర్సుగా పనిచేస్తూ ఎంతో మందికి ప్రాణాలు కాపాడవచ్చు. రోగులకు సేవలందించడం కోసమే ఈ వృత్తిని ఎంచుకున్నా.

– ఎస్. నీలాబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్–2

● కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



జేపీఎస్, ఓపీఎస్‌ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఏసీబీకి చిక్కిన గ్రామ కార్యదర్శి

- ఇంటి రికార్డు పేపర్లు ఇచ్చేందుకు రూ.10వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

డిండి: గ్రామ పంచాయతీ రికార్డులో ఉన్న ఇంటి ధ్రువపత్రం ఇవ్వడం కోసం రూ.10వేలు లంచం తీసుకుంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇంచార్జీ ఎంపీవో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ .శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన బైరోజి శంకరయ్య తండ్రి తిరుపతయ్య పేరు మీద డిండి గ్రామకంఠంలో 1975–80 సంవత్సర రికార్డు ప్రకారం 1100 గజాల స్థలంలో కొంత మేర ఇల్లు ఉంది. ఆ స్థలంలో 500 గజాల వరకు ఇతరులు ఆక్రమించుకుకోవడంతో తిరుపతయ్య మరణానంతరం కుమారులైన నారాయణ, శంకరయ్యకు కలిపి 600 గజాల స్థలం మాత్రమే మిగిలి ఉంది. ఆక్రమణదారుల నుంచి తమ స్థలం ఇప్పించాలని శంకరయ్య పలుమార్లు గ్రామ పెద్దలు, స్థానిక పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లాడు. తమ ఇంటి నెంబర్ ఆధారంగా 1975–80 సంవత్సరానికి సంబంధించిన రికార్డు ప్రకారం పేపర్లు ఇవ్వడంతోపాటు తమ పేరు మీదకు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో డిండి గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ను శంకరయ్య సంప్రదించాడు. ఇందుకోసం గ్రామకార్యదర్శి రూ.10వేలు డిమాండ్ చేశాడు. ఫిబ్రవరి 24న రూ.5 వేలు చెల్లించినా పేపర్లు మాత్రం ఇవ్వక పోగా మరో రూ.10వేలు ఇవ్వాలని గ్రామకార్యదర్శి డిమాండ్ చేశాడు. దీంతో శంకరయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం మధ్యాహ్నం డిండిలోని ఎంపీడీవో కార్యాలయంలో బైరోజీ శంకరయ్య గ్రామకార్యదర్శి శ్రావణ్‌కుమార్‌కు రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో శ్రావణ్‌కుమార్‌ను శుక్రవారం హాజరుపరుచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో గ్రామకార్యదర్శి నివాసం ఉంటున్న ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు దాడులు జరిపి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు వెంకట్రావ్, రామారావు, లింగస్వామి, సయ్యద్ ఖాదర్‌జిలానీ ఉన్నారు.



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ (మధ్యన కూర్చున్న వ్యక్తి)

ఈ రోడ్డు ఏ ఊరికి వెళ్తుందని అడిగి..

- మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన దుండగులు

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళను ఈ రోడ్డు ఏ ఊరికి పోతుందని సమాచారం అడిగి ఆమె మెడలోని పుస్తెల తాడును అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటన గురువారం ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవరపల్లి అండాలు సిరికంచల బాయి నుంచి పెద్దబావికి తన భర్త శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నడుచుకుంటూ వెళ్తుంది. భర్త శ్రీనివాస్‌రెడ్డి కొద్దిదూరంలో ఉన్నాడు. ఈక్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. అందులో ఒకరు బైక్‌పై ఉండగా మరొకరు అండాలు వద్దకు వచ్చి ఈ రోడ్డు ఎటువైపు వెళ్తుందని అడిగాడు. అందుకు ఆమె సమాధానం చెప్పేలోగా ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి..

చింతపల్లి: నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తులం బంగారు పుస్తెల తాడు (బంగారం గుండ్లు) అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున చింతపల్లి మండల పరిధిలోని తక్కెళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసోజు శాంభమ్మ తన ఇంటి సమీపంలోని రాసోజు చంద్రయ్య ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న తులం బంగారు గుండ్లను అపహరించుకెళ్లారు. స్థానిక సర్పంచ్ ఎస్‌ఐకు సమాచారం అందించడంతో నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డితో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



చింతపల్లి: తక్కెళ్లపల్లి గ్రామంలో బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ విఠల్‌రెడ్డి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు: మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన వెలుగు సూర్యనారాయణ(50) గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు తెగి ఉన్న విద్యుత్‌వైర్లు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు వెలుగు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా.. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కొండమల్లేపల్లి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన జై, రాహుల్‌లు తమ పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై పయనమయ్యారు. కాగా.. కొండమల్లేపల్లిలోని సాగర్ రోడ్డులో ఫర్నిచర్ తయారు చేసే షాపులో పనిచేస్తున్న బెంగాల్‌కు చెందిన రంజిత్ పని ముగించుకొని బైక్‌పై కొండమల్లేపల్లిలోని తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో సాగర్ రోడ్డులోని సాయి చౌదరి హోటల్ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు..

భువనగిరి: కారు చెట్టును ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయినిపల్లికి చెందిన ముగ్గురు యువకులు గురువారం యాదగిరిగుట్టలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి మండలంలోని మాసుకుంట సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నిఖిల్, శ్రీనివాస్‌తోపాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు వీటిని చికిత్స కోసం పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. రెండు కార్లు ధ్వంసం

బీబీనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న కారును ఢీకొనగా.. ఆ కారు దాని ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. హన్మకొండ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తుంది. ఈక్రమంలో బైపాస్‌లోని ఎస్‌బీఐ ఎదుట రహదారిపై ముందు వెళ్తున్న రెండు కార్లలో ఓ కారు ఒక్కసారిగా స్పీడ్‌ను తగ్గిస్తూ వెళ్తుండగా.. కారు వెనుకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు వేగం నియంత్రణలోకి రాకపోవడంతో ముందు ఉన్న కారును ఢీకొట్టింది. దీంతో ఆ కారు దాని ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. కార్లలో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.



ధ్వంసం అయిన కారు

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు



కనగల్ : కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. రామన్నపేట మండల పరిధిలోని జనంపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారి సొప్పరి చంద్రయ్య బృందం నాంపల్లి మండలంలో ఎల్లమ్మ పండుగ చేసి తిరిగి నల్లగొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఐదుగురిలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా మిగతావారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం జేసీబీ సహాయంతో కారును బయటకు తీశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



పర్వతం మహేష్

భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణ శివారులోని ప్లైవుడ్ కంపెనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన పర్వతం మహేష్ (30) ఇనుప సామగ్రి బేరం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తన బైక్‌పై వ్యక్తిగత పనిమీద పోచంపల్లి వైపు వస్తున్న క్రమంలో పట్టణ శివారులోని ప్లై వుడ్ కంపెనీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



వలిగొండ: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గస్తీ తిరుగుతున్న పోలీసులకు రోడ్డుపై మృతదేహం కనిపించగా పోలీస్‌స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై శ్యామ్ సుందర్ రెడ్డి అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు హనుమాన్ మాల ధరించాడని, కాషాయం రంగు దుస్తుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కేన్సర్‌తో బీజేపీ నేత కుమార్తె మృతి

వేములపల్లి: కేన్సర్ బారిన పడి కొంతకాలంగా చికిత్స పొందుతున్న బాలిక గురువారం తుదిశ్వాస విడిచింది. బీజేపీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి కుమార్తె తపశ్రీ(8)కి ఏడాది క్రితమే ఎముకల కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరు నెలల కిందట రూ.12లక్షలకు పైగా వెచ్చించి ఆపరేషన్ సైతం చేయించారు. వారం రోజుల కిందట బాలిక మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించినా ఫలితం కనిపించలేదు. కీమోథెరపీకి శరీరం స్పందించక ప్రాణాలు కోల్పోయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ నియోజకవర్గ బాధ్యురాలు కవిత బాలిక మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మామిడి సాగులో కొమ్మ కత్తిరింపులు కీలకం

- యాజమాన్య పద్ధతులపై ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి సూచనలు

గుర్రంపోడు: మామిడి మొక్కలు నాటినప్పటి నుంచి కొమ్మలు జాగ్రత్తగా కత్తిరింపు చేస్తే చెట్టుకు మంచి ఆకృతి రావడంతోపాటు, గాలి, సూర్యరశ్మి బాగా ప్రసరించి నాణ్యమైన, అధిక దిగుబడులకు దోహదపడుతుందని ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి తెలిపారు. మామిడి చెట్లకు కత్తిరింపులు, యాజమాన్య పద్ధతులపై సూచనలు ఆయన మాటల్లోనే..

చిన్న మొక్కల నుంచే కత్తిరింపు..

మామిడి మొక్క మూడు, నాలుగు అడుగులు పెరగనిచ్చి ఆ తర్వాత బలమైన పక్క కొమ్మలు ఏపుగా పెరిగేలా చూడాలి. అంతవరకు కాండంపై కొమ్మలను రాకుండా తీసివేయాలి. ఆపై మూడు ప్రథమ కొమ్మలు ఒకే చోట పుట్టకుండా ఒక్కో కొమ్మ 9 అంగుళాల దూరం వచ్చేలా చూడాలి. మొదట వచ్చిన ప్రధాన కొమ్మలను ప్రథమ కొమ్మలనుకుంటే, ఒక్కో ప్రథమ కొమ్మకు 3 ద్వితీయ కొమ్మలు, ఒక్కో ద్వితీయ కొమ్మకు మూడు తృతీయ కొమ్మలు, ఒక్కో తృతీయ కొమ్మకు మూడు చతుర్థ కొమ్మలు, ఇలా ప్రతి చెట్టులో 243 కొమ్మలు ఏర్పడతాయి. ఈ కొమ్మలన్నీ క్రమపద్ధతిలో పెరగడం వల్ల నలుదిశలా వ్యాపిస్తాయి. ఈ కొమ్మలన్నీ ఒకదానిపై మరొకటి రానందున, చిక్కు కొమ్మలు ఏర్పడనందున మంచి దిగుబడులు వస్తాయి. చిన్న మొక్కకు సకాలంలో సరైన కత్తిరింపులతో చెట్టు పెద్దయ్యాక మంచి ఆకారంతోపాటు, నాణ్యమైన సుస్థిర దిగుబడులు వస్తాయి.

గాలి, సూర్యరశ్మి రావడానికి..

గాలి, సూర్యరశ్మి ద్వారా చెట్టుకు కావాల్సిన ఆహార పదార్థాలు తయారై శ్వాస ద్వారా శక్తిగా మారి ఎదుగుదలకు, పుష్పించేందుకు, కాయలు వృద్ధి చెందేందుకు తోడ్పడతాయి. ఆకులు గుబురుగా ఉంటే సూర్యరశ్మి, గాలి తీసుకోక ఆహారపదార్థాల ఉత్పత్తి చెట్టులో తగ్గిపోయి దిగుబడి తగ్గిపోతుంది. చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యల పరిష్కారానికి మామిడిలో కత్తిరింపులు తప్పనిసరిగా చేసుకోవాలి.





కొమ్మల కత్తిరింపు విధానం

❖ కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్టుకు విశ్రాంతినివ్వాలి. అప్పుడే కొంత బలాన్ని పుంజుకుంటాయి. విశ్రాంతి నిచ్చిన తరువాత కొమ్మల కత్తిరింపులు ప్రారంభించి ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.

❖ అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, తెగులు సోకి ఎండిన కొమ్మలను పూర్తిగా కత్తిరించి తొలగించాలి.

❖ వ్యవసాయ పనులకు అడ్డంగా లేకుండా నేలను తాకుతున్న కొమ్మలను మొదటికి కత్తిరించి తొలగించాలి.

❖ ఎండిన పూత, కాడల ద్వారా ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున వాటిని తొలగించాలి.

❖ గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలకు ప్రసరించేలా తలపై మూడు, నాలుగు అంగుళాల మందం ఉన్న కొమ్మలను కత్తిరించి ఖాళీ స్థలం చేయాలి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో ఎండ మొదలుపై పడుతుంది.

❖ అవసరమైన తూర్పు, పడమర దశల్లోనూ 2 నుంచి 3 అంగుళాల మందమున్న కొమ్మలను కత్తిరించి కొమ్మల మధ్యలో ఖాళీ స్థలం ఏర్పడేలా చేయడం వల్ల సూర్యరశ్మి ఖాళీ స్థలం గుండా లోపలకు ప్రసరిస్తుంది. కొమ్మలు ఎక్కువగా వచ్చే బంగనపల్లి రకంలో ఈ రకం కత్తిరింపులు తప్పనిసరి చేసుకోవాలి.

❖ చెట్ల కొమ్మలు కత్తిరించడం వల్ల కొత్తగా పుట్టుకొచ్చే లేత కొమ్మలు 4 నుంచి 5 నెలలకే ముదిరి పూతకు వస్తాయి. కత్తిరించిన కొమ్మల నుంచి వచ్చిన లేత కొమ్మలు డిసెంబర్‌లో మంచి పూత పూస్తాయి.

❖ కత్తిరింపులు పూర్తయిన వెంటనే మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

యాజమాన్య పద్ధతులు

❖ రాలిపోయిన కాయలు, పండ్లు, ఎండు పుల్లలను, చెట్ల మొదళ్లలో ఎండిన బెరడును తీసి శుభ్రం చేసుకొని దున్నుకోవాలి. మొదటి దఫా ఎరువులు వేసుకోవాలి.

❖ నీటి వసతి ఉన్న చిన్న తోటల్లో అంతరపంటలు వేసుకోవచ్చు.

❖ లేత ఆకులు వచ్చిన మొక్కలకు సూక్ష్మదాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

కల్తీ పాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కల్తీ పాల ప్యాకెట్లు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి గ్రామంలో కల్తీ పాలను తయారు చేస్తున్న ఇంటిపై గురువారం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 80 లీటర్ల కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాల వ్యాపారి కంటే మహేందర్ కల్తీ పాలను విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు ఇంటిని తనిఖీ చేశారు. ఈమేరకు 80 లీటర్ల కల్తీ పాలతో పాటు 300 మీ. లీ హైడ్రోజన్ పెరాక్సైడ్, 10 స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, మహేందర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డివాముకు నిప్పు

మిర్యాలగూడ టౌన్: మండలంలోని తడకమళ్ల గ్రామంలో గురువారం గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన యల్లపల్లి నరసయ్య తన వ్యవసాయ పొలంలో గడ్డివామును నిల్వ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయంపై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. 950 గడ్డి కట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.80 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.